ఎమ్మెల్సీ కవితను కలిసిన సగర సంఘం నేతలు

మెహిదీపట్నం డిసెంబర్ 12: సగర సంఘం అభివృద్ధికి తోడ్పాటునందిస్తానని ఎమ్మెల్సీ కవిత అన్నారు. గురువారం తెలంగాణ సగర సంఘం నాయకులు ఆమెను కలిసి సంఘం అభివృద్ధిపై పలు అంశాలను చర్చించారు. సగర సంఘం నాయకులు కోడూరి శ్రీధర్‌సాగర్,విజేందర్ సాగర్,గోపి,భాస్కర్,భీష్మ.రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మన సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవి

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

రవీంద్రభారతి,డిసెంబర్ 12: విదేశీయులు కూడా ఆచరిస్తున్న మన సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని మాజీ మంత్రి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ సభ్యుడు డ్యాగ బాలరాజ్‌యాదవ్ 700 శ్లోకాలతో కూడిన భగవద్గీతకు అదనంగా మరో 45 శ్లోకాలను చేర్చి మొత్తం 745 శ్లోకాలతో కూడిన కర్మ, భక్తి, జ్ఞాన విభాగాలతో రూపొందించిన శ్రీమద్భగవద్గీత పుస్తకాలను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాల ద్వారా మనం చరిత్ర తెలుసుకోవచ్చునని తెలిపారు. ఒక సంవత్సరం పాటు శ్రమించి పుస్తకాలను రూపొందించిన బాల్‌రాజ్‌యాదవ్‌ను అభినందించారు. నేటి తరం యువత అనేక మందికి మన చరిత్ర, పండుగల విశిష్టత తెలియకపోవడం బాధాకరమన్నారు. దేశ విదేశాలల్లో మన పండుగలను,ఆచారాలను అనేక సందర్భాలలో జరుపుకోవడం ఎంతో గర్వకారణమన్నారు. అనంతరం బాల్‌రాజ్‌యాదవ్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత తెలుగు శాఖ అధ్యక్షుడు కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, జగన్నాథ శాస్త్రి, రచయిత్రి లావణ్య, కృష్ణస్వామి, ధూబే, మాణిక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

15, 16న గ్రూప్-2 పరీక్ష

సిటీబ్యూరో, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : గ్రూప్ 2 పరీక్షను 15, 16న నిర్వహించనున్నామని అన్ని ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం గ్రూప్ 2 పరీక్షల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో 48011 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్టు తెలిపారు. 101 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పీడబ్ల్యూడీ అభ్యర్థుల కోసం 27 కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఉదయం నిర్వహించే పరీక్షకు ఉదయం 8.30 గంటలలోపు, మధ్యాహ్నం పరీక్షకు మధ్యాహ్నం 1.30గంటలలోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉంటుందని తెలిపారు . ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సరిపడా బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీకి సూచించారు. అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి, డీఆర్‌ఓ వెంకటాచారి, జహీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే పీడీ..

రెవెన్యూ యంత్రాంగం ఆ దిశగా చర్యలు

సూచికబోర్డుల ఏర్పాటుకు ప్రణాళికలు

మేడ్చల్, డిసెంబర్12(నమస్తే తెలంగాణ): ప్రభుత్వ భూముల, చెరువుల సమీపంలో కబ్జా చేసి నిర్మించిన అక్రమ నిర్మాణాల కూల్చివేతల తర్వాత తిరిగి నిర్మిస్తే పీడీయాక్ట్ పెట్టేలా రెవెన్యూ యంత్రాంగం ప్రణాళికలను రూపొందిస్తుంది. ప్రభుత్వ భూములు, చెరువుల స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో రెవెన్యూ, నీటి పారుదల శాఖ సంయుక్తంగా సర్వే చేసి గుర్తించిన విషయం విధితమే. దీంతో రెవెన్యూ అధికారులు జిల్లా వ్యాప్తంగా అక్రమ నిర్మాణాలను కూల్చి వేస్తున్నారు. కూల్చివేసిన తర్వాత తిరిగి నిర్మాణాలు చేపడుతున్న క్రమంలో ఫిర్యాదులు వస్తున్నాయి. కఠిన చర్యలు తీసుకునేలా రెవెన్యూ యంత్రాంగం దృష్టి సారించింది. జిల్లాలో వేలాది సంఖ్యలో ఇప్పటికే అక్రమ నిర్మాణాలను కూల్చివేయగా తిరిగి కబ్జా చేసిన స్థలంలో నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలలో భాగంగా పోలీస్‌శాఖను రెవెన్యూ యంత్రాంగం పీడీయాక్ట్‌ను కోరనున్నట్లు అధికారుల ద్వారా తెలిసింది. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూమి రెవెన్యూ రికార్డుల ప్రకారం 5,195 ఎకరాలు ఉండగా ఇటీవల రెవెన్యూ, నీటి పారుదలశాఖ నిర్వహించిన సర్వేలో వందలాది ఎకరాలు కబ్జాలకు గురైనట్లు లెక్క తేల్చినప్పటికి అ వివరాలను రెవెన్యూ అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు(ఫైల్)

తహసీల్దార్లదే బాధ్యత..

ప్రభుత్వ భూములు కబ్జాలకు గురికాకుండా చూసే బాధ్యతను తహసీల్దార్లకే కలెక్టర్ అప్పగించారు. కబ్జాలను గుర్తించి తిరిగి అ భూమిని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. అక్రమ నిర్మాణాలు జరిగినట్లయితే పూర్తిగా విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూమిలో సూచిక బోర్డులను ఏర్పాటు చేసే విధంగా తహసీల్దార్లు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కూల్చివేతలు చేసిన ప్రభుత్వ భూములలో ప్రభుత్వ భూమి అని సూచిక బోర్డులతో పాటు ప్రహరీలను ఏర్పాటు చేసేలా ప్రణాళికలను రూపొందిస్తున్నారు.

శుభ్రతపై అవగాహన కల్పించాలి

సమావేశంలో మాట్లాడుతున్న టెన్నిస్ స్టార్ సానియా మీర్జా

ఖైరతాబాద్, డిసెంబర్ 12 : పారిశుధ్యం, శుభ్రతపై విద్యార్థి దశ నుంచే పిల్లలకు అవగాహన కల్పించాలని టెన్నిస్ స్టార్ సానియా మీర్జా సూచించారు. గురువారం హోటల్ తాజ్‌దక్కన్‌లో ఐటీసీ నిమాయిల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 'క్లీన్ ఈక్వల్ మిషన్' కార్యక్రమం పేరుతో ఐటీసీ నిమాయిల్స్ వారు విద్యార్థులకు శుభ్రతపై అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సంస్థ ఉపాధ్యక్షుడు సంజయ్ శ్రీనివాస్, గీతాంజలి దేవశాల ప్రిన్సిపాల్ మాధవి చంద్ర, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

తారామతి బారాదరిలో గురువారం సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో అలరించిన నృత్య ప్రదర్శన

హామీలను ప్రభుత్వం అమలు చేయాలి

మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌రావు

చిక్కడపల్లి,డిసెంబర్ 12 : శీతాకాల అంసెబ్లీ సమావేశాల్లో అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం వేతనాలు రూ.18000లకు పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌రావు, తెలంగాణ అంగన్‌వాడీ చీటర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ)అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సునీత, విజయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను పెంచుతూ కొత్త జీవో ఇస్తామని మంత్రి సీతక్క ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. మినీల పెండింగ్ వేతనాలు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూనియన్ ఆధ్వర్యంలో అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చామని ప్రభుత్వం స్పందించలేదని మండిపడ్డారు. పాత జీవో 10 ప్రకారం అతి తక్కువ డబ్బులు ఇచ్చి, 65 సంవత్సరాలు నిండిన వారిని జూలై 1 నుంచి విధుల నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తంచేశారు. అంగన్‌వాడీ టీచర్లకు 7 నెలల నుంచి పెండింగ్ వేతనాలు చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గుర్తింపు ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ గెలుపు

సిటీబ్యూరో, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : రైల్వే గుర్తింపు ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే వ్యాప్తంగా మజ్దూర్ యూనియన్ విజయఢంకా మోగించింది. సమీప ప్రత్యర్థి అయిన ఎంప్లాయీస్ సంఘ్‌పైన 2,663 ఓట్ల ఆధిక్యం సాధించింది. మజ్దూర్ యూనియన్‌కు 32,371 ఓట్లు వచ్చాయి. ఈ సందర్భంగా మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ కామ్రేడ్ శంకర్ రావు మాట్లాడుతూ గెలుపును అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ ప్రెసిడెంట్ కాల్వ శ్రీనివాస్, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఉదయ్ భాస్కర్, సరోజిని రెడ్డి, రవీందర్, వైస్ ప్రెసిడెంట్ రామ్మోహన్ ముదిరాజ్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 12. సుప్రసిద్ధమైన నరసింహ శతకకర్త శేషప్ప కవి జీవితం, సాహిత్యంపై వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నట్లు తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల్లోపు యువతీ యువకులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. సొంత రచన అని తెలియజేస్తూ స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేయాలని సూచించారు. జనవరి 20 లోగా తెలంగాణ సారస్వత పరిషత్, తిలక్ రోడ్డు, అబిడ్స్, హైదరాబాద్-1 చిరునామాకు పంపించాలని కోరారు. తెలుగు కవిత్వ రచనలో మెళకువలు నేర్పించే సంకల్పంతో తెలంగాణ సారస్వత పరిషత్ ఈ నెల17న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెన్నయ్య వెల్లడించారు. పాల్గొనే వారు 9603727234నంబర్ వాట్సాప్‌లో తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఏడు స్టార్టప్‌ల ఎంపిక

సిటీబ్యూరో, డిసెంబర్ 12(నమస్తే తెలంగాణ) : స్టార్టప్ ఇంక్యుబేటర్ సెమీకండక్టర్ ప్రోగ్రాం కింద ఏడు స్టార్టప్‌లను టీ హబ్ ఎంపిక చేసింది. సెమీ కండక్టర్ డిజైన్‌తో ఆటోమోటివ్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, 5జీ కమ్యూనికేషన్, బయోమెడికల్ పరికరాలు వంటి కీలకమైన రంగాల్లో ఆవిష్కరణలను వేగవంతం చేయడానికి ఈ కార్యక్రమం ఎంతగానో సహాయపడుతుందని, టీ హబ్ ఇన్‌చార్జి సీఈవో సుజిత్ జాగిర్దార్ తెలిపారు. గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఎడ్జబుల్ ఏఐ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్, ఎక్స్ బ్యాటరీ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, సెన్స్ హెల్త్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, స్మార్ట్‌కోష్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, స్పింట్రోనిక్స్ ఏఐ సెమీకండక్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్, మనో వేగా ఏఐ, నేచురల్ ఏఐ ప్రైవేట్ లిమిటెడ్ స్టార్టప్‌లు ఉన్నాయి. ఎంపిక చేసిన స్టార్టప్‌లకు అంతర్జాతీయ స్థాయిలో అనుసంధానం అవుతాయని, వనరులు, మార్గదర్శకత్వం, పరిశ్రమల భాగస్వామ్యం వంటి విషయాల్లో సహకారం ఉంటుందన్నారు. ఈ స్టార్టప్‌ల కోసం రూ. 69.09 కోట్ల పెట్టుబడులను పొందడంలో టీ హబ్ కీలక పాత్ర పోషించిందన్నారు.

సదస్సు సావనీర్ ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

ఓయూలో భూగర్భ శాస్త్రవేత్తల జాతీయ సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 12: ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై భౌగోళిక అన్వేషణ గణనీయమైన ప్రభావం చూపుతుందని కేంద్ర సముద్ర అభివృద్ధి శాఖ మాజీ కార్యదర్శి, ఎన్‌జీఆర్‌ఐ మాజీ డైరెక్టర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ హర్ష్ గుప్తా అన్నారు. ఆర్థిక వృద్ధిలో కీలకమైన లోహాలు, విలువైన ఖనిజాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అసోసియేషన్ ఆఫ్ ఎక్స్‌ప్లొరేషన్ జియోఫిజిసిస్ట్స్ (ఏఈజీ) స్వర్ణోత్సవాల సందర్భంగా 46వ వార్షిక సమ్మేళనం నిర్వహించారు. ఇందులో భాగంగా ఓయూ జియోఫిజిక్స్ విభాగంలో 'జియో ఎక్స్‌ప్లొరేషన్ ఫర్ క్రిటికల్ మినరల్స్ అండ్ ప్రీషియస్ మెటల్స్'పై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. ప్రారంభోత్సవానికి ఏఈజీ ఉపాధ్యక్షుడు, జియోఫిజిక్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ వీరయ్య అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ హర్ష్ గుప్తా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కరుణాసాగర్, ఓఎన్‌జీసీ బేసిన్ మేనేజర్ కరవణ్ణన్, జీఎస్ఐ మాజీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ రామమూర్తి, ఏఈజీ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి డాక్టర్ నరసింహారావు, సంయుక్త కార్యదర్శి బాబు, కోశాధికారి జవహర్, సహాయ కార్యదర్శులు అల్లిపీర, డాక్టర్ ఎంఎన్ చారి తదితరులు పాల్గొన్నారు.

గాంధీ దవాఖానకు ఆధునిక యంత్రం..

బన్సీలాల్‌పేట్, డిసెంబర్ 12 : ఆరోగ్య సేవలో భాగంగా గాంధీ దవాఖాన గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగానికి ఆస్ట్రేలియా నుంచి కొనుగోలు చేసిన రూ.27 లక్షల విలువైన ఆధునిక ఎసోఫెగల్ అండ్ ఆనల్ మెనోమెట్రీ మెషిన్‌ను అమెరికాలోని తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం(టీడీఎఫ్) విరాళంగా అందజేసింది. కాగా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్‌ఎన్ రాజకుమారి, మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర, గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం హెచ్‌ఓడీ, డాక్టర్ శ్రావణ్‌కుమార్, టాడీఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ రాజేశ్వర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. మెనోమెట్రి సొసైటీ ఆలిండియా అధ్యక్షుడు, నిమ్స్ వైద్యుడు డాక్టర్ నితీశ్ ప్రతాప్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలపై వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆధునిక ఎసోఫెగల్ అండ్ ఆనల్ మెనోమెట్రీ మెషిన్‌ను సమకూర్చిన గాంధీ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థి, అమెరికా శాఖ మాజీ అధ్యక్షుడు, సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యుడు డాక్టర్ దివేశ్ అనిరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. టీడీఎఫ్ సభ్యుడు సదానంద్, జీఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవిశేఖర్ రావు, ఆర్‌ఎంఓ డాక్టర్ శేషాద్రి, గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం వైద్యులు, పీజీ వైద్యులు పాల్గొన్నారు.

యంత్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ఇందిర, రాజకుమారి, శ్రావణ్‌కుమార్

ప్రభుత్వ భవనాల్లో సోలార్ తప్పనిసరి



ఎక్స్‌పో ను ప్రారంభించిన అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ కుమార్

మాదాపూర్, డిసెంబర్ 12: అన్ని ప్రభుత్వ భవనాల్లో తప్పనిసరిగా సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేయాలని తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షుడు వీపీ అశోక్ కుమార్ గౌడ్ సూచించారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో గురువారం ఏర్పాటు చేసిన డెయిరీ, ఫుడ్ ఎక్స్ పో ఇండియా గ్రీన్ ఎనర్జీ ఎక్స్ పో, గ్రీన్ వెహికల్ ఎక్స్ పో 2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ విచ్చేసి సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షుడు వీపీ అశోక్ కుమార్ గౌడ్, రాజేశ్ పరకాలతో కలిసి ఎక్స్ పోను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్క్స్ రియోటో ఎలక్ట్రిక్ వారు నగరంలో 25000 ఈవీ చార్జింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేస్తుందని, కిరాణ, పాన్, పంక్‌చార్ షాపుల్లో 24 గంటలు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ సోలార్ పవర్ పాలసీ 2015 సంవత్సరంలో ఎంతో సంచలనం సృష్టించి దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా నిలిచినప్పటికి ఆ స్థానాన్ని ఎక్కువ కాలం కొనసాగించలేకపోయామన్నారు. పరకాల మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్, ముఫ్త్ బిజిలీ యోజన, ప్రధాన మంత్రి కిసాన్ ఊర్జా సరక్ష ఏవం ఉత్థాన్ మహాభియాన్ వంటి పథకాల కింద సౌరశక్తిని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక రాయితీలను అందజేస్తుందని,రాష్ట్రం పరిశ్రమను ప్రోత్సహించని కారణంగా అటువంటి రాయితీలు, ప్రోత్సాహకాలను అందించడం లేదన్నారు. చార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలనుకున్న వారు 9154758247,9024480830 నంబర్‌లను సంప్రదించాలని కోరారు. 14 వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో 100 మంది ఎగ్జిబిటర్లు తమ ఉత్పత్తులను ప్రదర్శించగా 15 వేలకు పైగా సందర్శకులు విచ్చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పద్యనాటక పోటీలు ప్రారంభం

నాటక పోటీల్లో పాల్గొన్న కళాకారులను సత్కరించిన వక్తలు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 12: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీ తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య, రుద్రశివ సాంస్కృతిక సంస్థ సౌజన్యంతో శివానీ ఆర్ట్స్ అసోసియేషన్ 15వ వార్షికోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో తొమ్మిది రోజుల పాటు కొనసాగనున్న పద్యనాటక పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వ్యాస కళాక్షేత్రం అధ్యక్షుడు వేద వ్యాస్, శివానీ ఆర్ట్స్ మేనేజింగ్ డైరక్టర్ పాండవుల హరిప్రసాద్, అధ్యక్షుడు మొవ్వ దేవనాథ సూరి, గౌరవ అధ్యక్షుడు దొంతి శిల్పా రెడ్డి, డాక్టర్ గుంటి పిచ్చయ్య, సలహాదారులు గూడ రామకృష్ణ, కళా పోషకులు బొప్పన నరసింహారావు తదితరులు పాల్గొని కళాకారులను ఘనంగా సత్కరించారు.

ఐటీ కారిడార్‌లో రెడ్ వాక్

కొండాపూర్, డిసెంబర్ 12 : 'రిటైల్ ఎంప్లాయీస్ డే'ను పురస్కరించుకుని గురువారం నాలెడ్జ్‌సిటీలో టీ - వర్క్స్ సమీపంలో రిటైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఆర్‌టీఐ) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో రిటైల్ ఎంప్లాయీస్ డే (రెడ్) వాక్‌ను నిర్వహించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఆర్‌ఏఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్, నిరూస్ మేనేజింగ్ డైరెక్టర్ అవినాశ్ కుమార్, వైస్ చైర్మన్, అపోలో ఫార్మసీ సీఈఓ జయకుమార్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ధర్నా చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు సంఘీభావం తెలుపుతున్న టీయూటీఎఫ్ నేతలు

మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబర్ 12 : సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీయూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు రామినేని వెంకటేశ్వర్లు(ఆర్‌వీ) డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న ధర్నా గురువారం 3వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా టీయూటీఎఫ్ నేతలు ధర్నాకు వచ్చి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు లేకపోతే విద్యాశాఖలోని అన్ని కార్యక్రమాలు కుంటుపడుతాయన్నారు. విద్యార్థులకు సబంధించిన డేటా అప్‌లోడ్, మధ్యాహ్న భోజన పథకం బిల్లులు, మండల వనరుల కేంద్రంలో అన్ని రకాల పనులు ఆగిపోతున్నాయని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీస వేతనంతో పాటు క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టీయూటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు జంగిటి కైలాసం, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చిత్తలూరి వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి, నాయకులు ప్రేమ్‌కుమార్, విఠల్, సమగ్ర శిక్ష ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పరికరాల గుర్తింపునకు 15న శిబిరం

అంబర్‌పేట, డిసెంబర్ 12: భారత ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ ద్వారా ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 15న దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు, సహాయ పరికరాలు ఉచితంగా అందించేందుకు అర్హులైన వారి గుర్తింపునకు శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అంబర్‌పేట మున్సిపల్ మైదానంలో ఉదయం 10 గంటల నుంచి ఈ శిబిరం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. వికలాంగుల ధ్రువీకరణ(సదరం) పత్రం, యూడీఐడీ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, మూడు పాస్ ఫొటోలు తీసుకొని శిబిరానికి రావాలని కోరారు. వివరాలకు 9290212675 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

అమ్మంగికి సాహితీ పురస్కారం

కవి డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్, వీసీ ఆచార్య వెల్దండ నిత్యానందరావులను సత్కరించిన వక్తలు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 12: శ్రీ కృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం ఆధ్వర్యంలో భాషా నిలయం వ్యవస్థాపక కార్యదర్శి రావి చెట్టు రంగారావు జయంతిని పురస్కరించుకుని సుప్రసిద్ధ రచయిత, కవి డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్‌కు రావి చెట్టు రంగారావు తెలుగు భాషా వికాస పురస్కారాన్ని సుల్తాన్‌బజార్‌లో గల భాషా నిలయం ప్రాంగణంలో గల ఆడిటోరియంలో గురువారం సాయంత్రం ప్రదానం చేసి సత్కరించారు. అనంతరం భాషా నిలయం దీర్ఘకాల కార్యదర్శి, రచయిత యం.ఎల్ నరసింహారావు పేరిట నెలకొల్పిన సాహితీసేవా పురస్కారాన్ని పరిశోధకులు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెల్దండ నిత్యానందరావుకు ప్రదానం చేశారు. గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రియాజ్, సాహితీవేత్తలు సంగనభట్ల నరసయ్య, దేవకీదేవి భాషా నిలయం గౌరవకార్యదర్శి ఉడయవర్లు పాల్గొని తెలుగు భాషకు, సంస్కృతి, భాషా నిలయం పరిరక్షణకు రావిచెట్టు రంగారావు, ఎంఎల్ నరసింహారావు చేసిన కృషిని కొనియాడారు.

ఆకట్టుకున్న మహానాట్య మహోత్సవం

రవీంద్రభారతి,డిసెంబర్ 12: ప్రసిద్ధ నాట్యగురు సీఆర్ ఆచార్యులు వారసురాలిగా కూచిపూడి ,ఆలయ సంప్రదాయ నాట్యాలకు అంకితమైన ఎందరో శిష్య పరశిష్యులను తీర్చిదిద్దిన వోలేటి రంగమణి జన్మ ధన్యమని పలువురు వక్తలు కొనియాడారు. గురువులుగా ఐదు దశాబ్దాల వోలేటి రంగమణి నాట్య సేవలను వైభవాన్ని గుర్తు చేసుకుంటూ శిష్యులంతా కలసి చేసిన మహానాట్యార